క్లుప్తంగా

'అమరుల త్యాగాలు స్మరించుకుందాం'

ఆసిఫాబాద్‌అర్బన్: ఎస్సీ వర్గీకరణ కోసం అమరులైన వారిని స్మరించుకుంటూ శనివారం అమరవీరుల దినోత్సవాన్ని గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించి నివాళులర్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి రేగుంట మహేశ్‌మాదిగ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణమాదిగ సారథ్యంలో వర్గీకరణ సాధనలో ప్రాణత్యాగాలు చేసిన వారి త్యాగాలను ప్రతిఒక్కరు గుర్తు చేసుకోవాలని తెలిపారు. ఉద్యమంలో అమరులైన వారి కుటుంబాలకు ఎమ్మార్పీఎస్ ఎల్లప్పుడు అండగా నిలుస్తుందని తెలిపారు.

ముగిసిన భద్రకాళి జాతర



ఆలయ ప్రాంగణంలో ప్రభల ఊరేగింపు

పెంచికల్‌పేట్: మండలంలోని పంచకళపురి క్షేత్రంలో గత మూడు రోజులుగా కొనసాగుతున్న శ్రీభద్రకాళి సమేత వీరభద్ర స్వామి జాతర శుక్రవారం ముగిసింది. చివరిరోజు ఆలయ ప్రాంగణంలో భాజాభజంత్రీల చప్పుళ్ల మధ్య ఊరేగింపు నిర్వహించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య వీరభద్రస్వామి, భద్రకాళీ ప్రభల అగ్నిగుండాల ప్రవేశం అంగరంగ వైభవంగా నిర్వహించారు. చివరి రోజు పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

'కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి'

బెజ్జూర్: వేతనాలు చెల్లించని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ నాయకులు పేర్కొన్నారు. పీహెచ్‌సీ ఆసుపత్రిలో స్వీపర్లకు పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలతో పాటు ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ఈపీఎఫ్ పూర్తి వివరాలు తెలియజేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బెజ్జూర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ అవినాశ్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కాంట్రాక్టర్‌ను ఎన్నిసార్లు అడిగినా రేపుమాపు అంటూ కాలయాపన చేస్తున్నారన్నారు. ఇంతవరకు ఈపీఎఫ్ పూర్తి వివరాలు తెలియజేయడం లేదని, సమస్యల పరిష్కారం కోసం డీసీహెచ్‌ఎస్ చెన్న కేశవ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని, లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో సిబ్బంది రాజ్ కుమార్, శ్రీనివాస్, చంద్రశేఖర్, లక్ష్మి, రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని వాఘాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కొలాంగూడ గ్రామంలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎంపీడీవో శంకర్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాఘాపూర్‌లో 160 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడం జరిగిందన్నారు. ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించి మార్చి 10లోగా అన్ని ఇళ్లు బేస్‌మెంట్ స్థాయిలో నిర్మాణం పూర్తయ్యేలా చూస్తామన్నారు. లబ్ధిదారులకు మొదటి విడత రూ. లక్ష అందిస్తామన్నారు. కార్యక్రమంలో హౌజింగ్ ఏఈ నసీర్, ఎంపీవో శోభన, పంచాయతీ కార్యదర్శి హేమలత, కొడప లస్మ, భూపెల్లి శ్రీధర్, మర్సుకొల హనుమంతు, రాజేందర్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ అతీఖ్ బేగం అన్నారు. శుక్రవారం కళాశాలలో ఆర్‌బీఐ ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు, పౌర శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విస్తృత ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు పొదుపు అలవాటు చేసుకోవాలని సూచించారు. సైబర్ నేరగాళ్లు ఇటీవల కాలంలో సెల్‌ఫోన్‌లకు లింకులు పంపి మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. పౌర శాస్త్ర రిటైర్డ్ లెక్చరర్ సుజాతను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రఘు, లెక్చరర్లు చంద్రకాంత్, రమేష్, అజయ్, వినోద్, శ్రీనివాస్, ముబారక్, స్వామి పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం వివిధ పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేజీబీవీ, గిరిజన గురుకుల బాలికల పాఠశాలకు చెందిన 86 మంది విద్యార్థినులకు పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కళ్లద్దాలు అవసరం ఉన్న విద్యార్థులను రిమ్స్‌కు పంపించనున్నట్లు వైద్యాధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో రిమ్స్ హస్పిటల్ కంటి ప్రొఫెసర్ అనీష్, వైద్యాధికారి కిరణ్‌కుమార్, అప్తాల్మిక్ అధికారి భాస్కర్, పాల్గొన్నారు.

తాగునీటి కష్టాలు

- నిలిచిన మిషన్ భగీరథ నీటి సరఫరా
- రోజు విడిచి రోజు ట్యాంకర్ ద్వారా పంపిణీ
- బోరుబావుల వద్దకు పరుగులు
- ఇబ్బందులు పడుతున్న చిన్న ఐనం గ్రామస్తులు



చిన్నఐనంలో పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేస్తున్న అధికారులు

దహెగాం: రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగుతుండడంతో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి మొదలైంది. పలు గ్రామాల్లో గత 20 రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తాగునీటికి వాగులు, ఒర్రెల వద్దకు పరుగులు తీస్తున్నారు. చేతి పంపులు లేకపోవడంతో తాగు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని చిన్న ఐనం గ్రామంలో నీటి కోసం అష్టకష్టాలు పడుతున్నారు. గ్రామంలో ఎస్టీ వాడ, రెండు బీసీ వాడల్లో తాగు నీటి ఎద్దడి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మూడు వాడలు.. 66 కుటుంబాలు..

మండలంలోని చిన్న ఐనం గ్రామం మండల కేంద్రానికి కేవలం 2 కిలోమీటర్ల దూరంలో ఉంది. గ్రామంలో ఎస్టీ వాడలో 16 కుటుంబాలు, రెండు బీసీ వాడల్లో 50 కుటుంబాలు ఉన్నాయి. ఇక్కడ ఎలాంటి తాగునీటి వసతి, చేతి పంపులు లేవు. గత సంవత్సరం తాగునీటి ఇబ్బందులు తీర్చడానికి గ్రామ సమీపంలోని ఒర్రెలో బోరు బావి వేసి మోటర్ బిగించి గ్రామంలో ట్యాంకుకు నీటిని సరఫరా చేశారు. అయితే నీటి సరఫరా కొద్ది రోజులు మాత్రమే జరిగిందని వాపోతున్నారు. బోరుబావి మోటరు గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని పేర్కొంటున్నారు. మిషన్ భగీరథ నీటిని గ్రామంలోని ట్యాంకుకు ఎక్కిస్తుండడంతో నీటికి ఇబ్బందులు పడలేదు. అయితే కాగజ్‌నగర్ మండలం అందవెల్లి పెద్దవాగు వద్ద అప్రోచ్ రోడ్డు నిర్మాణం ప్రారంభించడంతో అధికారులు పైప్‌లైన్‌ను తొలగించారు. దీంతో భగీరథ నీరు సరఫరా నిలిచిపోవడంతో గ్రామస్తులకు కష్టాలు మొదలయ్యాయి.

ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా..

చిన్న ఐనం తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో పంచాయతీ అధికారులు పంచాయతీకి చెందిన వాటర్ ట్యాంకర్ ద్వారా గ్రామస్తులకు నీరు సరఫరా చేస్తున్నారు. ఒకరోజు విడిచి ఒకరోజు సరఫరా చేస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో రోజు ట్యాంకర్ సైతం రావడం లేదని ఆరోపిస్తున్నారు. ట్యాంకర్ వచ్చినప్పుడు ఇంటికి ఒక డ్రమ్ము నీళ్లు పట్టుకుని కాలకృత్యాలు తీర్చుకుంటున్నామని వాపోతున్నారు. గ్రామంలో శుభకార్యాలు ఉంటే మరింత ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.

తాగునీటికి ఇబ్బందులు..

ట్యాంకర్ ద్వారా సరఫరా చేసే నీటిని కాలకృత్యాలకు వినియోగిస్తున్నామని, తాగేందుకు బోరు బావుల యజమానులను బతిమిలాడి నీళ్లు తెచ్చుకుంటున్నామని వాపోతున్నారు. వాగుకు వెళ్లి చెలిమల నుంచి తాగు నీటికి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాగులో ఏర్పాటు చేసిన బోరు బావిలో మోటర్ బిగించి దాహార్తి తీరుస్తామన్న అధికారులు ఇప్పుడు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో నెలకొన్న తాగునీటి కష్టాలను తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నీళ్లకు గోసైతంది



ఇరవై రోజులసంది నీళ్లకు బాగా గోసైతంది. పంచాయతీ నుంచి ట్యాంకర్‌తో నీళ్లు తెస్తంద్రు కాని ఒక రోజు తప్పించి మరో రోజు తెస్తంద్రు. తేని రోజు చానా ఇబ్బంది పడుతున్నాం. తాగు నీటికి వాగుకు పోవాల్సి వస్తంది. సార్లకు చెప్పినా పట్టించుకుంట లేరు. బండ్ల మీద పోయి తాగు నీళ్లు తెచ్చుకుంటున్నం. మాకష్టాలు ఎవరు పట్టించుకుంట లేరు.

– మేకల లక్ష్మి, చిన్న ఐనం

బోరు బావిలో మోటార్ బిగించాలి



వాగులో వేసిన బోరు ఎందుకో పని చేస్త లేదు. ఊర్ల వేయమని అంటే వాగులో బోరు వేసింద్రు. ఇరవై రోజుల నుంచి భగీరథ నీళ్లు వస్తలేవు. పంచాయతీ నుంచి ట్యాంకర్ నుంచి తెస్తున్న నీళ్లు రోజు డ్రమ్ము మాత్రమే పట్టుకుంటున్నం. ఆ నీళ్లు మాకు సరిపోతలేవు. పనులు ఇడిసిపెట్టి నీళ్లకు తండ్లాడుతున్నం. బోరు బావికి మోటార్ ఏర్పాటు చేసి ట్యాంకుకు నీళ్లు ఎక్కిస్తే మా గోస తీరుతుంది. సార్లు దయచూపి నీళ్ల కష్టాలు తీర్చాలి.

– కోట సత్తక్క, చిన్న ఐనం

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి



మాట్లాడుతున్న దిలీప్ కుమార్

పెంచికల్‌పేట్: గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఆర్‌ఎంపీలు, పీఎంపీలు ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు జాడి దిలీప్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆర్‌ఎంపీల కార్యవర్గ సమావేశానికి హాజరై మాట్లాడుతూ ఆర్‌ఎంపీలు సమస్యలపైన సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ కోదండరాం, విజ్ఞాన దర్శిని అధ్యక్షుడు రమేశ్‌లను కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో ఇచ్చిన విధంగా ఆర్‌ఎంపీలకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్‌లు అందజేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రగిరి దాస్, లక్ష్మణ్‌గౌడ్, లహాన్‌రాజ్, వీరాచారి, అర్జున్, రాజలింగు, గోపాల స్వామి, ఎమ్మాజీ, రఘునాథ్, ఇబ్రహీం, శివ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

తిర్యాణి: మండలంలోని పంగిడిమాదర గ్రామంలో శుక్రవారం సీపీఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు గ్రామంలోని 336 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఎఫ్ సంస్థ సభ్యులు సత్యనారాయణ, చంద్రకాంత్, కవిత, చౌవన్ సంతోష్ తదితరులు ఉన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



చేడ్వాయి ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల ప్రదర్శన

పెంచికల్‌పేట్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులు చేసిన సైన్స్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాకేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కెరమెరిలో..

కెరమెరి: జాతీయ సైన్స్ దినోత్సవంలో భాగంగా మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గోయగాం, కెరమెరి, ప్రాథమిక పాఠశాల సావర్‌ఖెడాలో శుక్రవారం సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో క్విజ్, ఎస్సే రైటింగ్, ప్రయోగశాల, యాంత్రిక శక్తి విధానం, వివిధ రకాల శక్తి విధానంపై ప్రయోగాలు ప్రదర్శించారు. అనంతరం సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంఈవో ఆడే ప్రకాశ్, టీచర్లు తదితరులు ఉన్నారు.

కౌటాలలో..

కౌటాల: విద్యార్థులు సైన్స్‌పై పట్టు సాధించాలని ఎంఈవో గావుడే హన్మంతు అన్నారు. కౌటాల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోనే ఉజ్వల భవిష్యతు ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యతో పాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గణపతి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, మహేశ్వర్, మమత తదితరులు పాల్గొన్నారు.



కౌటాల పాఠశాలలో సైన్స్‌డే వేడుకలు



గోయగాం జెడ్పీఎస్ఎస్‌లో..

బస్సు సేవలు కరువు

- ఉచిత బస్సు ప్రయాణానికి దూరం
- ఆటోలే దిక్కు
- పట్టించుకోని అధికారులు



లింగాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించింది. పట్టణాలు, పల్లెల్లో మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణాలు చేస్తున్నారు. కానీ మండలానికి ఆర్టీసీ బస్సు సేవలు లేకపోవడంతో మండలంలోని మహిళలు ఉచిత బస్సు ప్రయాణానికి దూరమవుతున్నారు. ఆసిఫాబాద్ డిపో నుంచి వచ్చే ఏకైక బస్సు కూడా కొద్ది రోజులకే నిలిచిపోవడంతో మండలవాసులు ఇబ్బందులు పడుతున్నారు.


బీటీ రోడ్డు సౌకర్యం ఉన్నా..

లింగాపూర్ మండలం ఏర్పడి ఎనిమిదేళ్లు గడుస్తున్నాయి. ఈ మండలంలో 14 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 20వేలకు పైగా జనాభా ఉంది. వీటిలో అనేక గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వారంతా ఆటోలు, ద్విచక్ర వాహనాలపైనే ప్రయాణాలు సాగించాల్సిన పరిస్థితి ఉంది. మండలంలోని గ్రామాలకు బస్సు సేవలు ప్రారంభించాలని పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు.

అధిక చార్జీలు వెచ్చించి..

జిల్లాకేంద్రం నుంచి కెరమెరి, జైనూర్, ఉట్నూర్, ఆదిలాబాద్ వరకు బస్సు సేవలు కల్పించారు. కానీ జైనూర్ నుంచి లింగాపూర్ మండలానికి వెళ్లాలంటే కనీసం 30 కిలోమీటర్ల ప్రయాణం చేయాల్సి ఉంటుంది. జైనూర్ మండలం వరకు బస్సు సౌకర్యం ఉన్నా సిర్పూర్(యూ), లింగాపూర్ మండలాల ప్రజలు నిత్యం జిల్లా కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటారు. కానీ మండలానికి బస్సు సేవలు లేక మండలవాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి అధిక చార్జీలు చెల్లించి ప్రయాణాలు సాగిస్తున్నారు. కొన్ని రోజులపాటు ఆసిఫాబాద్ నుంచి లింగాపూర్‌కు బస్సు నడిచేది. అయితే బస్సులకు సరైన ఆక్యుపెన్సీ రావడం లేదని బస్సు సేవలను నిలిపివేశారు. లింగాపూర్ నుంచి జిల్లా కేంద్రానికి రోజూ విద్యార్థులు, మహిళలు, ప్రజలు వెళ్తుంటారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రయాణ కష్టాలు ఎదుర్కొంటున్నారు. జిల్లా కేంద్రం నుంచి పిక్లాతండా గ్రామం వరకు బస్సు సర్వీసు నడపాలని అధికారులకు విన్నవించినా సమస్య పరిష్కారం కావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.


ఆటోలోనే ప్రయాణం..



మండలానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ఆటోలోనే ప్రయాణం చేస్తున్నాం. బస్సులో ప్రయాణం చేయాలంటే జైనూర్ వెళ్లి బస్సు ఎక్కాల్సిన పరిస్థితి ఉంది. మా గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని అధికారులకు వినతిపత్రాలు అందజేశాం. కానీ ప్రయోజనం లేదు.

– రాథోడ్ గోవింద్, పిక్లాతండా

బస్సు నడపాలి..



మా గ్రామం నుంచి నిత్యం విద్యార్థులు, ప్రజలు జైనూర్, ఆసిఫాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. బస్సు సౌకర్యం లేక ప్రభుత్వం అందించే ఉచిత ప్రయాణానికి దూరమవుతున్నాం. ప్రైవేట్ వాహనాల్లో అధిక చార్జీలు చెల్లిస్తున్నాం. అధికారులు బస్సు సేవలు ప్రారంభించాలి.

– నేతావత్ వనిత, పిక్లాతండా

సింగరేణి పార్కులో ఫొటోషూట్ అనుమతించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి పార్కులో ఫొటోషూట్‌లను యాజమాన్యం అనుమతించాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి కోరారు. శుక్రవారం బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయ భాస్కర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ యాజమాన్యం కొన్ని కారణాలతో పార్కులో ఫొటోషూట్ నిషేధించిందన్నారు. గోలేటిలో నివాసం ఉండే ఉద్యోగులు, పరిసర గ్రామాల ప్రజల కోరిక మేరకు పార్కులో ఫొటోషూట్ నిర్వహించేందుకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శులు కిరణ్‌బాబు, మారం శ్రీనివాస్, నాయకులు రాజయ్య, జహంగీర్ పాషా, నరేశ్, సమీ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోపాలకాల



ఆలయంలో గోపాలకాల నిర్వహిస్తున్న భక్తులు

కౌటాల: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా కౌటాల మండలంలోని తాటిపల్లి గ్రామంలో గల శ్రీ సిద్ధి హనుమాన్ మందిరంలో మూడో రోజు శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో భక్తిశ్రద్ధలతో గోపాల కాల నిర్వహించారు. అనంతరం భక్తులకు మహాప్రసాదం పంపిణీ చేశారు. భక్తులు తరలివచ్చి వార్ధ నదిలో పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులు చెల్లించుకున్నారు. వేలాదిగా తరలి వచ్చిన భక్తుల వార్ధా నది తీరం జనజాతరను అనంతరం ఆలయంలోని హనుమాన్ విగ్రహాన్ని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయా గ్రామాల భక్తుల భజనతో ఆలయంలో భక్తిభావం నెలకొంది. ఆలయం ఎదుట షాపుల్లో భక్తులు పలు వస్తువులు కొనుగోలు చేస్తూ సందడి చేశారు. దీంతో ఆలయంలో భక్తులతో కిటకిటలాడింది. వార్ధా నది పుణ్యస్నానాలు ఆచరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు నారాయణ్ పటేల్, ఆలయ కమిటీ చైర్మన్ ఎల్ములే దత్తు, కమిటీ సభ్యులు బొమ్మకంటి మహేశ్, ప్రవీణ్, మారుతి, సంతోష్, చంపత్, వాసుదేవ్, ధనరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ అధికారులకు సన్మానం



సన్మానిస్తున్న జీఎం విజయభాస్కర్‌రెడ్డి

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలో పనిచేసి శుక్రవారం ఉద్యోగ విరమణ పొందిన ఇద్దరు అధికారులను గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డి సన్మానించారు. ఏరియా సర్వే అధికారిగా పని చేసిన చంద్రశేఖర్, ఎంవీటీసీ మేనేజర్‌గా పని చేసి పదవీ విరమణ పొందిన విజయ్‌సింగ్ ఇందా దంపతులను జీఎం శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. జీఎం మాట్లాడుతూ ఆరోగ్యాన్ని మించిన సంపద లేదన్నారు. ఎస్‌వోటూజీఎం రాజమల్లు, ఏరియా ఇంజనీరు రామనాథం, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, అధికారులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో జీఎంకు సన్మానం..

బెల్లంపల్లి ఏరియా నూతన జనరల్ మేనేజర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన విజయ్ భాస్కర్‌రెడ్డిని శుక్రవారం ఏరియా టీబీజీకేఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో నూతన జీఎంను శాలువాతో సన్మానించారు. ఏరియాకు సుపరిచితమైన అధికారి జీఎంగా రావడం సంతోషకరమన్నారు. ఎస్‌వోటూజీఎం రాజమల్లు, కేంద్ర కమిటీ నాయకులు మంగీలాల్, నాయకులు సంపత్, వెంకటేశ్వర్లు, దేవేందర్, రమేశ్, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



జీఎంను సన్మానిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

గుంతలు తవ్వారు.. వదిలేశారు!



లింగాపూర్: మండల కేంద్రంలోని ఆయా కాలనీల్లో మిషన్ భగీరథ పైప్‌లైన్‌ల మరమ్మతుల కోసం తవ్వకాలు జరిపారు. గుంతలు తవ్వి పది రోజులు గడిచినా పూడ్చకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తూతూ మంత్రంగా మరమ్మతులు చేపట్టడంతో ఇళ్లకు మిషన్ భగీరథ నీరు కూడా అందడం లేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి గుంతలు పూడ్చడంతో పాటు నీరు సరఫరా జరిగేలా చూడాలని కోరుతున్నారు.

ఉపాధి అవకాశాలు కల్పించాలి

ఉట్నూర్‌రూరల్: షెడ్యూల్ ప్రాంతంలోని ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించాలని హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన ఎంఎస్‌ఎంఈ పాలసీ రౌండ్ టేబుల్ సమావేశంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు కోరారు. ఖానాపూర్ నియోజకవర్గంలోని షెడ్యూల్ ప్రాంతాల్లోని ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులకు ఉపాధి కల్పించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఐటీ శాఖమంత్రి దుద్దిల్ల శ్రీధర్, బాబును కోరడం జరిగిందన్నారు. ఆదిలాఆద్ జిల్లా అంత్యత వెనుకబడిన ప్రాంతమని ముఖ్యంగా ఖానాపూర్ నియోజకవర్గంలో ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాలు పూర్తి షెడ్యూల్ ప్రాంతాలని, అనేక మంది చదువుకొని నిరుద్యోగులుగా ఉన్నారని వారికి మొదటి ప్రాధాన్యత కల్పిస్తూ కుటీర, చిన్న తరహా పరిశ్రమలను నెలకొల్పి ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. తోటి, కొలాంతెగకు చెందిన ఆదివాసీలు వెదురుతో అనేక రకాల పనిముట్లు తయారు చేస్తారన్నారు. ఫారెస్ట్ ద్వారా కొంత వెసులుబాటు కల్పించి, వారికి ఉపాధి మార్గాలను చూపెట్టాలన్నారు. ఐటీడీఏ ద్వారా నెలకొల్పిన పలు కుటీర, చిన్న తరహా పరిశ్రమలు ఉపయోగంలో లేవన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం చొరవ చూపాలన్నారు.